క్లుప్తంగా

భీమేశ్వరాలయంలో ఆరోగ్య పాశుపతాభిషేకం



భీమేశ్వరాలయంలో 108 లీటర్ల గో క్షీరంతో అభిషేకం చేస్తున్న అర్చకులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని హసన్‌బాదలో వేంచేసిన మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో పదో వార్షికోత్సవం పురస్కరించుకుని సోమవారం ఆలయ అర్చకుడు ఉండి వీరభద్రశర్మ బ్రహ్మత్వంలో మాస శివరాత్రి కమిటీ ఆధ్వర్యంలో 108 లీటర్ల ఆవుపాలతో ఆరోగ్య పాశుపతాభిషేకం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ విగ్రహ ప్రతిష్ఠ చేసిన గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు, దేవి దంపతులు, వెంకటరత్నం, దేవి దంపతుల చేతుల మీదుగా విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు, గ్రామపెద్దలు చోడిశెట్టి వీరభద్రరావు, బొల్లం సత్తిరాజు, చెక్కా తాతాజీ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భగవంతుని పట్ల భక్తిశ్రద్ధలు కలిగి ఉండాలి



కాజులూరులో కృష్ణాలయం పునర్నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మంత్రి సుభాష్ తదితరులు

కాజులూరు: భగవంతుని పట్ల ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలు కలిగి ఉండాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. కాజులూరులో ఇటీవల రోడ్డు వెడల్పు పనుల్లో తొలగించిన వేణుగోపాలస్వామి ఆలయం (కృష్ణాలయం) పునర్నిర్మాణానికి సోమవారం మంత్రి సుభాష్ భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ దైనందిన జీవితంలో నిత్యం ఒడిదొడుకులతో జీవించే మనిషికి ఆధ్యాత్మిక చింతన మానసిక ప్రశాంతతను కలిగిస్తుందన్నారు. నూతన ఆలయ నిర్మాణానికి తనంతు కృషి చేస్తానని దాతలు, భక్తులు ముందుకు రావాలన్నారు. మాజీ ఎంపీపీ యాళ్ల కృష్ణారావు, అన్నం శ్రీరామచంద్రమూర్తి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ యాళ్ళ వెంకటరమణ, బండారు బూరయ్య తదితరులు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విజయ దుర్గా పీఠంలో కలెక్టర్ పూజలు



పీఠంలో పూజలు చేస్తున్న భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు

రాయవరం: తెలంగాణ రాష్ట్రంలోని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కె.హనుమంతరావు సోమవారం విజయదుర్గ పీఠాన్ని సందర్శించారు. పీఠంలోని భవాని అష్టమ లింగేశ్వరస్వామికి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. పీఠంలో నిర్వహించిన నవగ్రహ, నక్షత్ర హోమంలో పాల్గొన్న కలెక్టర్ హనుమంతరావు పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం కలెక్టర్ హనుమంతరావు విజయదుర్గా పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం (గాడ్)ను కలిసి ఆయన ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా పీఠం ప్రతినిధి గార్గే భాస్కర్ నారాయణ కలెక్టర్‌ను శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో విజయ దుర్గ సేవాసమితి ప్రతినిధులు గాదె సత్య వెంకట్ కామేశ్వరి, పెదపాటి సత్య కనక దుర్గ, బలిజేపల్లి రమ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'రాజసయోగం మయసభ'



'రాజసయోగం మయసభ' నాటిక ప్రదర్శన

సఖినేటిపల్లి: మహాభారతంలోని 'రాజసయోగం మయసభ' నాటిక ఆకట్టుకుంది. శ్రీరామనవమి ఉత్సవాలు పురస్కరించుకుని మోరి లింగమ్మ చెరువు సీతారామస్వామి ఆలయం వద్ద నాటిక ప్రదర్శన చేశారు. దుర్యోధనుడి పాత్రలో న్యాయవాది యాలంగి రమేష్, భానుమతిగా కల్యాణి, సహాయ నటులుగా రమణి, బళ్ల పర్వతాలు, విశ్వనాథం నటించారు. యాలంగి సుమిత్‌రామారావు ట్రస్ట్ ఆధ్వర్యంలో నాటిక ప్రదర్శనలు చేస్తున్నామని రమేష్ వివరించారు. నాటక రంగ వైభవాన్ని భావితరాలకు వివరించాలనే ప్రదర్శనలు చేస్తున్నామన్నారు. నాటిక ప్రదర్శనలో పాల్గొన్న కళాకారులను శ్రీరామ శెట్టిబలిజ సంఘ సభ్యులు ఘనంగా సత్కరించారు.

ఈత.. హద్దు మీరితే వెత

- నరదాల కోసం ప్రాణాలు బలి పెట్టుకొంటున్న యువత
- ఈతకు వెళ్లి తల్లిదండ్రులకు కడుపుకోత మిల్చుతున్న విద్యార్థులు
- సెలవు రోజుల్లో జాగ్రత్తలు అవసరం
- కుటుంబ సభ్యులతో సమయం గడపడం మేలు

కపిలేశ్వరపురం: జీవితం ఓ మధురానుభూతి.. ఓ అభుభవం. ఓ బాధ్యత. అంతటి జీవితాన్ని కొందరు ఆకతాయి పనులకు బలిపెట్టుకొంటున్నారు. నది, కాలువల్లో స్నానాలకు దిగి చావును కొని తెచ్చుకుంటున్నారు. బైక్‌లను వేగంగా నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల ఎంతో మంది యువకులు సరదా కోసం స్నానాలకు దిగి గల్లంతై మృత్యువాత పడ్డారు. ఇంటర్, పదో తరగతి పరీక్షలు పూర్తయ్యాయి. ఫలితాలు కోసం వేచి చూస్తున్న విద్యార్థులు స్నేహితులు, సహచర విద్యార్థులు, బంధువులతో సరదాలకు వెళ్తున్నారు. విద్యా సంవత్సరం విరామ సమయాన్ని విజ్ఞాన సముపార్జనకో మానవ సంబంధాలను మెరుగుపర్చు కోవడానికో వినియోగించుకోవాలి. పాఠశాలలకు వేసవి సెలవుల నేపథ్యంలో జీవన గమనంపై ఈ కథనం...

ప్రమాదాలు ఇలా..

ఈ నెల 1న రామచంద్రపురం పట్టణం రైలు గట్టుకు చెందిన యలమంచిలి ఉమాఅఖిలేశ్వరరావు అనే 15 ఏళ్ల బాలుడు పదో తరగతి పరీక్షలు పూర్తయిన ఆనందంలో స్నేహితులతో కలసి కాలువలో ఈతకు దిగి చనిపోయాడు. ఈ ఏడాది మార్చి 28న అనపర్తి మండలం కొప్పవరంలోని నల్లకాలువ గట్టుపై నివాసముంటున్న తాపీ మేస్త్రి నాలుగేళ్ల కుమార్తె అనూష భార్గవి ఆడుకొంటూ ప్రమాదవశాత్తూ జారి పడి మృతి చెందింది. ఈ ఏడాది జనవరి 3న ముమ్మిడివరం మండలం కొత్తలంక వృద్ధి గౌతమీ గోదావరి పాయలో స్నానానికి దిగిన బీటెక్ విద్యార్థి మంగ విజయ వీరమణికంఠ మృతి చెందాడు. 2023 ఏప్రిల్ 14న కె.గంగవరం మండలం కూళ్ల వద్ద గోదావరి నదిలో స్నానానికి దిగిన స్నేహితులు పామర్రుకు చెందిన కొప్పిశెట్టి ఆసాయిరామ్ (24), మట్టపర్తి ఆనంద్ (32), కరప మండలం వేళంగికి చెందిన పితాని రాజేంద్ర (25) నదిలో కొట్టుకుపోయి మృతి చెందారు. సాయిరామ్ పుట్టినరోజు సందడిలో వారు స్నానానికి దిగారు. 2021 జనవరి 27న కపిలేశ్వరపురానికి చెందిన ఇంటర్మీడియెట్ విద్యార్థి శ్రీసజన్ గోదావరిలో స్నానానికి దిగి చనిపోయాడు. 2020 సెప్టెంబర్ 9న కేదారిలంక వద్ద గోదావరినదిలో జారిపడి కొత్తపేటకు చెందిన వలంటీర్ చోడపనీడి శ్రీవెంకటదుర్గ సాయిలక్ష్మణ్ చనిపోయాడు. 2023 మే 21న ఆలమూరు మండలం జొన్నాడ వద్ద గోదావరి నదిలో స్నానానికి దిగిన ఇంటర్ విద్యార్థి అయిన అయినవిల్లి మండలం పెద్దిపాలెంనకు చెందిన మోటూరి త్రిలోక్ (17), కొత్తపేట సాయిబాబా మందిర సమీప నివాసితుడైన నర్సరీ కూలి గెడ్డం కరుణకుమార్ (22) మృతి చెందారు. వారి స్నేహితుడు కపిలేశ్వరపురం మండలం కోరుమిల్లికి చెందిన అయినవిల్లి భవానీ శంకర్ పుట్టినరోజును జరుపుకున్న తర్వాత వారు నదిలో స్నానానికి వెళ్లారు. ఆయా ఘటనల్లో కారణాలేమైనప్పటికీ వారి జీవితాలు అర్థాంతరంగా ముగిసిపోయాయి. ఈ నేపథ్యంలో యువత జాగ్రత్త వహించాల్సిన అవసరం ఉంది.

మృత్యుకుహరాలు ముంచేస్తాయి

మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల వెంబడి విస్తారమైన గౌతమి గోదావరి నదీతీరముంది. కేదారిలంక, తాతపూడి, కపిలేశ్వరపురం గ్రామాల ర్యాంపుల్లో ఇసుకను తవ్వుతుండటంతో లోతైన గుంతలు పడుతున్నాయి. స్నానాలకు దిగినవారి గుంతల్లో కూరుకుపోయి ప్రమాదాల్లో చిక్కుకొనే అవకాశాలున్నాయి. రెండు నియోజకవర్గాల్లోని గ్రామాల్లో పెద్ద చెరువులు సైతం ఉన్నాయి. అవన్నీ విహారాన్ని, విశ్రాంతిని కోరుకునే యువకులను విశేషంగా ఆకర్షిస్తాయి. గోదావరి నదిలో ఇసుక తవ్వకాలతో లోతైన గుంతలు ఏర్పడతాయి. ఈతకోసం దిగిన వారు ఆ గుంతల్లో మునిగే ప్రమాదం ఉంది. జిల్లా వ్యాప్తంగా 97 కిలోమీటర్లు మేర సముద్రతీరం ఉంది. నియోజకవర్గాల యువకులు సముద్ర స్నానాలకు వెళ్తుంటారు. అవన్నీ మృత్యు కుహరాలుగా గమనించాల్సిన అవసరముంది.

సెల్ఫీ కోరికకు కళ్లెం వేయాల్సిందే

నదిలోకి దిగి సెల్ఫీ తీసుకోవడాన్ని యువకులు ఇష్టపడుతున్నారు. అదే వారి పాలిట యమపాశంగా మారొచ్చు.

సెల్ఫీ తీసుకునేందుకంటూ వెనక్కి వెళ్లి గల్లంతై కేదారిలంకలో పడవ రేవులో ఒక యువకుడు గతంలో మృతి చెందాడు.

కుటుంబంతో గడిపితే హాయి

సెలవులను కుటుంబ సభ్యులతో గడపడం మేలు. విద్యా సంవత్సరమంతా పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులు రెండు నెలలు పాటు ఉండే సెలవులను కుటుంబ సభ్యులు, ఆత్మీయులు, స్నేహితులతో గడపడం ద్వారా మానవ సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవచ్చు. అప్పటికీ మిగిలిన సమయాన్ని గ్రంథాలయాలను సందర్శించడం మరింత ప్రయోజనాన్ని ఇస్తుంది.



వెదురుమూడి కోరంగి కెనాల్‌లో ఈత కొడుతున్న చిన్నారులు

ప్రాణం విలువ తెలుసుకుని జాగ్రత్త పడాలి



సమాజంలో ప్రతి ఒక్కరూ ప్రాణం విలువ తెలుసుకుని జీవించాలి. ఏ ఒక్కరూ ఒంటరిగా జీవించలేరు. సమాజంలోని ఇతరులతో ముడిపడి జీవితం ఉంటుంది. విద్యార్థులు సెలవు దినాలను కుటుంబ సభ్యులతోనూ, బంధువులతోనూ గడపడం ద్వారా మానవ సంబంధాలలు బలోపేతం అవుతాయి. సామాజిక అంశాలతో కూడిన పుస్తకాలను చదవడం అలవాటు చేసుకోవడం మేలు.

పితాని రవికుమార్, సైకాలజిస్ట్, కౌన్సిలర్, అంగర

అప్పుడు కాదని.. ఇప్పుడు అవునని

ద్రాక్షారామ సర్పంచ్ తీరుపై విమర్శలు

రామచంద్రపురం రూరల్: మండలంలో మేజర్ పంచాయతీ అయిన ద్రాక్షారామ సర్పంచ్ పరిస్థితి అప్పుడు కాదని.. ఇప్పుడు అవునని అనక తప్పని పరిస్థితి ఎదురైందని గ్రామస్తులు విమర్శలు చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే ద్రాక్షారామ పంచాయతీ భవనం ఆవరణలో గత వైఎస్సార్ సీపీ హయాంలో ద్రాక్షారామ-1, ద్రాక్షారామ-2 గ్రామ సచివాలయాలకు రెండు పక్కా భవనాలు, ఆర్బీకే ఈ ప్రాంగణంలో నిర్మాణమయ్యాయి. ఈ నేపథ్యంలో ఎప్పటికైనా మున్సిపాలిటీ అవుతుందని ఆ స్థాయికి తగ్గట్లుగా ఈ ప్రాంగణం మంచి లుక్కుతో ఉండాలని పంచాయతీ ప్రాంగణం ఎదురుగా ఉన్న పలు ఆక్రమణలను సర్పంచ్ కొత్తపల్లి అరుణ విజయవంతంగా తొలగించగలిగారు. గతంలో వైఎస్సార్ సీపీ జెండా స్తూపం కూడా ఇక్కడ ఉండేది. అభివృద్ధిలో భాగంగా వైఎస్సార్ సీపీ స్థూపాన్ని కూడా తొలగించారు. అయితే గత సార్వత్రిక ఎన్నికల సమయంలో ప్రస్తుత మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు మద్దతుగా టీడీపీలో చేరిన సర్పంచ్ అరుణ, భర్త రాంబాబు గత నెల 29న టీడీపీ ఆవిర్భావ దినోత్సవం రోజున ఆ పార్టీకే చెందిన ఇతర నాయకులు అందరినీ ఖాళీ చేయించిన అదే ప్రాంతంలో టెంటు వేసి పార్టీ ఆవిర్భావ దినోత్సవం పేరుతో ఆ పార్టీ జెండా స్తూపం హడావుడిగా నిర్మించారు. అయితే ఈ కార్యక్రమానికి సర్పంచ్, ఆమె భర్త హాజరుకాకపోవడం గమనార్హం. దీంతో అన్ని ఆక్రమణలు తొలగించడంలో పట్టుదలగా వ్యవహరించిన సర్పంచ్ వాళ్ల సొంత పార్టీ దిమ్మనే ఇక్కడ ఏర్పాటు చేయకుండా ఆపలేకపోయారని స్థానికులు అనుకుంటున్నారు. అంతే కాకుండా ఈ జెండా దిమ్మ పక్కనే మేము కూడా పార్టీ జెండా స్థూపాలు పెట్టుకుంటామంటూ వివిధ పార్టీల నుంచి, ప్రజా సంఘాల నుంచి అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



ద్రాక్షారామ పంచాయతీ భవనాల ప్రాంగణం బయట వివాదాలకు కారణమవుతున్న టీడీపీ పార్టీ జెండా స్తూపం

ఆరోగ్యం పట్ల అవగాహన అవసరం

కపిలేశ్వరపురం: ఆరోగ్యం పట్ల ప్రతిఒక్కరికీ శాస్త్రీయమైన అవగాహన ఉండాలని అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పి.రత్నకుమారి అన్నారు. మండలంలోని అంగర పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంగర, పడమర ఖండ్రిక వీధుల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. పీహెచ్‌సీ ఆవరణలో నిర్వహించిన సదస్సులో డాక్టర్ రత్నకుమారి మాట్లాడుతూ ఆధునిక సమాజంలో ఆరోగ్యంతో జీవించడం ఒక సవాల్‌గా మారిందన్నారు. మానవ శరీరం పట్ల, ఆహార పద్ధతులు పట్ల, జీవనశైలి పట్ల శాస్త్రీయమైన అవగాహనను కల్పించుకోవడం ద్వారా సంపూర్ణమైన ఆరోగ్యాన్ని పొందవచ్చన్నారు. వైద్య, ఆరోగ్య కార్యకర్తలు ప్రజల్లో ఆరోగ్య అంశాల పట్ల అవగాహన పెంచాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ జిత్తుక మల్లికార్జునుడు, హెల్త్ ఎడ్యుకేటర్ బి.రామారావు, వైద్య, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణలో పీఎంపీల పాత్ర కీలకం

మండపేట: ప్రజారోగ్య పరిరక్షణలో పీఎంపీల పాత్ర అమూల్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు కోన సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి ఈ శిబిరాన్ని ప్రారంభించారు. రాజమహేంద్రవరానికి చెందిన రాజేష్ డయాబెటిస్ ఎండోక్రైన్ సెంటర్ సహకారంతో అధికారులు, కార్యాలయ సిబ్బందికి, పట్టణ పోలీసు సిబ్బందికి ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ దుర్గారాణి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలన్నారు. పోషకాహారం తీసుకుంటూ జీవనశైలిని మెరుగుపరుచుకోవాలన్నారు. 152 మందికి పరీక్షలు నిర్వహించినట్టు సత్యనారాయణ తెలిపారు. పీఎంపీ సంఘ ఉపాధ్యక్షుడు బల్లా వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి యిరవాడ రవికుమార్, కోశాధికారి వానపల్లి కనకరాజు, మారిశెట్టి సత్యనారాయణ, మండపూడి చంద్రశేఖర్, పుత్సల కాశి, పిల్లా సతీష్, నరేష్, గాలింకి నాగేశ్వరరావు, జోగా సత్యనారాయణ శిబిరంలో సేవలు అందించారు.



అంగర పీహెచ్‌సీ వద్ద మాట్లాడుతున్న డాక్టర్ రత్నకుమారి



శిబిరాన్ని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

ఆరోగ్య నియమాలు పాటిస్తే అంటువ్యాధులు దూరం

కాజులూరు: ఆరోగ్య నియమాలు సక్రమంగా పాటిస్తే మనిషి అంటువ్యాధులకు దూరంగా ఉండగలుగుతాడని గొల్లపాలెం అలయన్స్ క్లబ్ అధ్యక్షురాలు, గ్రామ ఉప సర్పంచ్ తాడి భువనేశ్వరీదేవి అన్నారు. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకుని గొల్లపాలెంలో క్లబ్ సభ్యులు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం గ్రామ వీధుల్లో ర్యాలీలు నిర్వహించి మెరుగైన ఆరోగ్యం కోసం ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్లకార్డ్స్ ద్వారా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమాలలో క్లబ్ సభ్యులు వీరవల్లి గణపతి, తాడి దుర్గారాజశేఖర్‌రెడ్డి, అంజి, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్టతో భూసారం

- మోతాదుకు మించి రసాయన ఎరువులు వినియోగిస్తే ముప్పు
- రబీ అనంతరం పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకుంటే మేలు
- రైతులకు రాయితీపై విత్తనాలు



రాయవరం మండలంలో సాగు చేసిన పచ్చిరొట్ట (ఫైల్)

రాయవరం: వ్యవసాయంలో రసాయన ఎరువుల వాడకం పెరిగిపోతోంది. రసాయన ఎరువుల అధిక వినియోగంతో పాటు పంటల మార్పిడి విధానాన్ని పాటించకపోవడం వలన భూసారం తగ్గుతోంది. ఈ పరిస్థితుల్లో రబీ పంటల అనంతరం చేలల్లో పచ్చిరొట్ట పైరును పెంచడం వలన భూసారాన్ని పెంచుకునే వీలుంది. తద్వారా రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించుకోడానికి వీలుంటుందంటున్నారు మండల వ్యవసాయాధికారి కొప్పిశెట్టి ప్రభాకర్. పచ్చిరొట్ట సాగుకు సంబంధించిన పలు విషయాలను ఆయన 'సాక్షి'కి వివరించారు.

రబీ వరి కోతలు

దాళ్వా వరి కోతలకు రైతులు సిద్ధమయ్యారు. ముందుగా నాట్లు వేసిన చేలు కోత దశకు చేరుకోవడంతో రైతులు కోతలు ప్రారంభించారు. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలో 1.01లక్షల ఎకరాల్లో రబీ వరిసాగును చేపట్టారు. రైతులంతా పచ్చిరొట్ట సాగు చేస్తే ఖరీఫ్‌లో మంచి దిగుబడులు సాధించే అవకాశముంది. గతంలో రైతులు భూసారం పెరగడానికి పచ్చిరొట్టను రబీ అనంతరం వేసేవారు. ఇటీవల కాలంలో పచ్చిరొట్ట పెంపకం తగ్గిపోయింది. దీని వలన భూసారం తగ్గి.. పంటలు తెగుళ్ల బారిన పడుతున్నాయి. రైతులు తెగుళ్లను అరికట్టడానికి విచ్చలవిడిగా రసాయన పదార్థాలను పిచికారీ చేసి అనర్థాలను కొనితెచ్చుకుంటున్నారు. రబీకి ఖరీఫ్‌కు మధ్యలో పచ్చిరొట్ట పైర్లను పెంచడం వలన భూసారం పెరుగుతుంది.

స్థూల పోషకాలు అధికం

జనుము, జీలుగ, పిల్లిపెసర, ఉలవ, నీలి తదితర రకాలను ఖరీఫ్‌కు ముందు సాగు చేసుకోవాలి. వీటిని పూత దశ వరకూ పెంచి ఖరీఫ్‌లో భూమిలో కలియదున్నాలి. పచ్చిరొట్టలో స్థూల పోషకాలు అధికంగా ఉంటాయి. నత్రజని 1.8 శాతం నుంచి 3.5 శాతం, భాస్వరం 0.1 శాతం నుంచి 0.3 శాతం, పొటాషియం 0.5 నుంచి 2 శాతం వరకు ఉంటాయి. స్థూల పోషకాలతో పాటు సూక్ష్మ పోషకాలు కూడా భూమికి లభిస్తాయి. పంటల ఎదుగుదలకు ఈ మూడు పోషకాలు ఎంతో అవసరం. భూమిలో పల నిక్షిప్తమైన పోషకాలను ఈ పైర్లు వెలికి తీస్తాయి. ఈ పైర్ల సాగు వలన 30 శాతం రసాయన ఎరువుల వినియోగం తగ్గుతుంది. రైతులు ఆర్థికంగా లాభపడడానికి పచ్చిరొట్ట పైర్లు దోహదం చేస్తాయి. ప్రస్తుతం ఎరువుల ధరలు ఆకాశాన్నంటుతున్న పరిస్థితుల్లో పచ్చిరొట్ట పైర్ల సాగు ఎంతో మేలు.

గుళికల ప్రభావంతో..

ఖరీఫ్, రబీ పంటల్లో రైతులు గుళికలను అధికంగా వాడడం వలన భూమి లోపల సూక్ష్మజీవులు నశించిపోతున్నట్లు వ్యవసాయ అధికారుల పరిశోధనల్లో తేలింది. గతంలో ఒక గ్రాము మట్టికి కోట్లాది సూక్ష్మజీవులు ఉండగా ప్రస్తుతం వాటి సంఖ్య లక్షల్లో పడిపోయినట్లుగా పరిశోధనల్లో తేలుతుంది. పంటల పెరుగుదలకు ఉపయోగమైన సూక్ష్మ జీవులు నశించడం వలన దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. పచ్చిరొట్ట పైర్లను భూమిలో కలియదున్నడం వలన తిరిగి సూక్ష్మజీవులు అభివృద్ధి చెందే అవకాశం ఉందని ప్రభాకర్ చెబుతున్నారు. సహజంగా చౌడు బారి పోయిన భూముల్లో జీలుగ వేసుకుంటే భూసారం పెరిగి పంటకు అనుకూలంగా మారుతుంది.

రైతు సేవా కేంద్రాల్లో విత్తనాలు



మూడో పంటగా వేసవిలో సాగు చేసుకునేందుకు రైతులకు 50 శాతం రాయితీపై వ్యవసాయ శాఖ ద్వారా అపరాల విత్తనాలు పంపిణీ చేస్తున్నాం. 364 కేజీల మినుములు, 820 కేజీలు పెసలు అన్ని రైతు సేవా కేంద్రాల్లో రైతులకు అందుబాటులో ఉంచాం. మినుములు కేజీ రూ.140, పెసలు కేజీ రూ.130కి ఇస్తున్నాం. రైతులు మూడో పంటగా అపరాలు, పచ్చిరొట్ట విత్తనాలు వేసుకోవాలి. పంటను తీసుకుని, పంట వ్యర్థాలను భూమిలో కలియదున్నడం వలన భూసారం పెరుగుతుంది. రైతులు ఈ అకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– కొప్పిశెట్టి ప్రభాకర్, మండల వ్యవసాయాధికారి, రాయవరం

మద్యం షాపు ఏర్పాటుపై కలెక్టర్‌కు ఫిర్యాదు

మండపేట: స్థానిక సత్యశ్రీ రోడ్డులో నివాస ప్రాంతాలు, జనసంచారం ఎక్కువగా ఉంటే ప్రాంతంలో మద్యం షాపు ఏర్పాటు చేస్తున్నారు. దీనిని 28, 29, 30 వార్డుల ప్రజలు వ్యతిరేకిస్తూ ధర్నాలు, రాస్తోరోకోలు, ఆందోళనలు చేసినా ఫలితం లేదు. దీంతో రిలే దీక్షలు చేపట్టారు. దాదాపు 20 రోజులుగా ఆందోళనలు చేస్తున్నా అధికారులు స్పందించకపోవడంతో సోమవారం బాధితులు అమలాపురం వెళ్లి కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ పిల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మహిళలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇళ్ల మధ్యలో మద్యం షాపు తొలగించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కారానికి హామీ ఇస్తూ ఎక్సైజ్ డీసీకి సిఫార్సు చేసినట్టు కౌన్సిలర్ శ్రీనివాస్ తెలిపారు. కలెక్టరేట్‌లో ఎక్సైజ్ డీసీకి శ్రీనివాస్ సమస్యను వివరించారు. దీనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారని చెప్పారు.



ఎక్సైజ్ డీసీకి సమస్యను వివరిస్తున్న కౌన్సిలర్ శ్రీనివాస్

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గోపాలరావు

రామచంద్రపురం: బార్ అసోసియేషన్‌కు సోమవారం నిర్వహించిన ఎన్నికల్లో నూతన కార్యవర్గం ఎన్నికైనట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన టి.చలపతికుమార్ వెల్లడించారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది ఉండవల్లి గోపాలరావు, ఉపాధ్యక్షుడిగా గోవర్ధనం మల్లేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా బొడ్డు వరాహ నరసింహమూర్తి, సంయుక్త కార్యదర్శులుగా పీవీఎస్ జానకి, ఎన్‌వీ శేషుకుమార్, కోశాధికారిగా చింతపల్లి శ్రీనివాస్, క్రీడలు సంస్కృతిక విభాగానికి కార్యదర్శిగా సాదే నారాయణరావు, మహిళా ప్రతినిధిగా లకాని పద్మ కమలకుమారిలు ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పిల్లి మురళీమోహన్, సీనియర్ న్యాయవాదులు మల్లిడి హరినాథ్‌రెడ్డి, వాడ్రేవు సాయిప్రసాద్, డీపీ శాస్త్రి, యు.దుర్గాప్రసాద్, బలుసు వెంకటేశ్వరరావు, తదితర పలువురు న్యాయవాదులు నూతన అసోసియేషన్ కార్యవర్గానికి అభినందనలు తెలియజేశారు.



నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ కార్యవర్గం

వితంతు పింఛన్లు అందించాలి

మామిడికుదురు: వితంతు పింఛన్లు అందించి ఆదుకోవాలంటూ పలువురు మహిళలు డిమాండ్ చేశారు. పాశర్లపూడికి చెందిన ఈతకోట వెంకటలక్ష్మి దీనిపై సోమవారం కోనసీమ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం ఇచ్చారు. 2007 ఏప్రిల్ 14న తన భర్త భాస్కరరావు మృతి చెందారని చెప్పారు. కానీ అప్పటి నుంచి ఇప్పటి వరకు తనకు వితంతు పింఛన్ మంజూరు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమెతో పాటు అదే గ్రామానికి చెందిన మోడా పైడమ్మ, అంకాని కాసులమ్మ, మందపాటి సత్యవతి, నేదునూరి ప్రభావతి, ఈతకోట వెంకటలక్ష్మి, అంగాని నాగమణి, దిగుమర్తి పెద్దింట్లు, పిల్లి బేబి సరస్వతి కూడా తమకు వితంతు పింఛన్లు మంజూరు చేయాలని వేడుకున్నారు. ఎన్నిసార్లు దరఖాస్తులు చేసినా విడో పింఛన్లు ఇవ్వకపోవడంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. దీనిపై అధికారులు స్పందించి తమకు పింఛన్లు మంజూరు చేయాలన్నారు.



వితంతు పింఛన్లు మంజూరు చేయాలని అభ్యర్థిస్తున్న పాశర్లపూడికి చెందిన వితంతువులు

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

కొత్తపేట: మండలంలోని పలివెలలో కోదండరామ స్వామి వారి ఆలయం (ముసలి రామాలయం) వద్ద పంచముఖ ఆంజనేయస్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. సీఎస్ఎస్ ట్రస్ట్, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 27 అడుగుల పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహాన్ని నెలకొల్పారు. విగ్రహావిష్కరణ కార్యక్రమాలు ఈ నెల 5 నుంచి ప్రారంభించారు. మధ్యలో ఆదివారం శ్రీరామనవమి పర్వదినం పురస్కరించుకుని సీతారాముల కళ్యాణం ఘనంగా జరిపారు. సోమవారం తెల్లవారుజామున 2.30 గంటల నుంచి వైదిక స్మార్థ ఆగమ పండితుడు బ్రహ్మశ్రీ కొంపెల్ల రఘునాథశాస్త్రి ఆధ్వర్యంలో వేద పండితుల బృందం ఆలయ కమిటీ సభ్యుల దంపతులతో వివిధ పూజలు, హోమాలు, జరిపారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, ఎంపీపీ మార్గన గంగాధరరావు, అముడా మాజీ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, వైఎస్సార్ సీపీ నాయకుడు కర్రి నాగిరెడ్డి, మాజీ సర్పంచ్ చవల జగన్నాథం తదితరులు పాల్గొన్నారు. ప్రతిష్ఠను పురస్కరించుకుని మంగళవారం భారీ ఎత్తున అన్నసమారాధన నిర్వహిస్తున్నట్టు ట్రస్ట్ సెక్రటరీ భమిడిపాటి దుర్గాలక్ష్మీనారాయణ తెలిపారు.



పలివెలలో పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ట్రస్ట్, ఆలయ కమిటీ సభ్యులు

కనకదుర్గమ్మకు లక్ష చామంతి పూజ

మామిడికుదురు: పెదపట్నంలంకలో కొలువుదీరిన కనకదుర్గమ్మకు చైత్ర శుద్ధ దశమి సందర్భంగా వసంతోత్సవం పూజలను సోమవారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా కనకదుర్గమ్మకు ఏకాదశ రుద్రాభిషేకం, పుణ్యాహవాచనం, పంచగవ్యప్రాశన, నవదుర్గారాధన, అభిషేకాలు, తదుపరి లక్ష చామంతి పూజ, లలితా హోమం పూజలను అంగరంగ వైభవంగా జరిపించారు. వేద మంత్రాలు, భక్తుల కోలాహలం నడుమ వసంతోత్సవం పూజలు అంగరంగ వైభవంగా జరిగాయి. పలువురు భక్తులు ఈ పూజల్లో కర్తలుగా పాల్గొన్నారు. అమ్మ వారిని దర్శించుకుని అర్చకుల నుంచి వేద ఆశీర్వచనం అందుకున్నారు.